క్లుప్తంగా

బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమావేశం



ఇందుకూరుపేట: గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరిదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలను సమన్వయంతో నిర్వహించి, విజయవంతం చేయాలని తహసీల్దార్ కృష్ణప్రసాద్ కోరారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఈఓ తాతా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. జూన్ రెండు నుంచి 13 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నామని వివరించారు. కల్యాణం, రథోత్సవం, తెప్పోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు.

ఆధార్ కార్డును తప్పక తీసుకురావాలి



అభా నంబర్‌ను కేటాయిస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు: ప్రభుత్వాస్పత్రికి వచ్చే సమయంలో ఆధార్, దానికి అనుసంధానమైన ఫోన్ నంబర్‌ను విధిగా తీసుకురావాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అభా) బీమా నంబర్‌ను పొందేందుకు గానూ వీటిని తప్పక తీసుకురావాలని కోరారు. ఈ నంబర్‌ను పొందిన వారు దేశంలో ఎక్కడైనా రూ.ఐదు లక్షల వరకు ఉచిత వైద్యాన్ని పొందొచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

మనుబోలు: మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ జలజాక్షి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో రూ.3.60 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో శ్మశానానికి హద్దులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు కేటాయిస్తామని తెలిపారు. ఒక్కొక్కరికి రోజుకు రూ.300 వరకూ వేతనం అందేలా చూస్తామన్నారు. ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు. నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కోవిడ్ నిబంధనలు పాటించాలి

మనుబోలు: కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పూజిత సూచించారు. ఆమె శుక్రవారం ఆస్పత్రిలో మాట్లాడుతూ మళ్లీ కరోనా వ్యాప్తి చెందకుండా ఉన్నతాధికారులు మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. మాస్క్‌లు ధరించాలన్నారు. తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటించాలన్నారు. జ్వరం, దగ్గు, వాంతులు, తలనొప్పి, గొంతు నొప్పి, రుచి తెలియకపోవడం తదితర లక్షణాలుంటే ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు.

నిమ్మ ధరలు పతనం



- బీజాపూర్ మార్కెట్ ప్రభావం
- అక్కడి నుంచి భారీగా ఎగుమతి
- ఆగస్ట్ వరకు ఇదే పరిస్థితి
- దసరా నుంచి ధరలు పెరిగే అవకాశం



యార్డులో నిమ్మకాయల గ్రేడింగ్

పొదలకూరు: ఒకప్పుడు ఇక్కడి నిమ్మకాయలకు ఎంతో డిమాండ్ ఉండేది. ఇప్పుడు దాదాపుగా అన్ని రాష్ట్రాల్లో సాగు చేస్తున్నారు. అయితే అక్కడ ఏడాది పొడవునా దిగుబడి ఉండదు. ఈ ప్రాంతంలో స్వల్పంగానైనా దిగుబడి సంవత్సరం మొత్తం ఉంటుంది. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ ప్రాంతం నుంచి ఎగుమతి అవుతున్న నిమ్మకాయల వల్ల మార్కెట్ పతనమైంది. సరుకు దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు విపరీతంగా ఎగుమతి అవుతుండటంతో మన ప్రాంత రైతులకు గిట్టుబాటు కావడం లేదు. కొందరు రైతులు ధరలు పెరుగుతాయని ఆశ పెట్టుకుని తోటల్లో కాయలను ఉంచారు. ప్రస్తుతం కిలో రూ.25 నుంచి రూ.50 మాత్రమే ఉంది. బస్తా (లూజు) లెక్కన పరిశీలిస్తే రూ.2 వేల నుంచి టాప్ రూ.4 వేల వరకు ధరలు పలుకుతున్నాయి. అయితే నాణ్యత ఉన్న కాయలకు మాత్రమే ఈ ధరలు వర్తిస్తాయని వ్యాపారులు అంటున్నారు. అత్యధికంగా కాయలు రూ.2 వేలే పలుకుతున్నట్టుగా తెలుస్తోంది. ఇందువల్ల రైతులకు గిట్టుబాటు ధరలు లభించవని భావిస్తున్నారు. అయితే వారం క్రితం వరకు ఆశించిన దానికంటే అదనంగానే ధరలు లభించాయి.

పెరిగిన దిగుబడి

బీజాపూర్ నుంచే కాక మన రాష్ట్రంలోని తెనాలి, ఏలూరు, పొదలకూరు, గూడూరు, తెలంగాణ రాష్ట్రం నకిరేకల్ తదితర మార్కెట్ల నుంచి నిమ్మకాయలు ఎగుమతులు పెరిగాయి. తోటల నుంచి దిగుబడులు పెరిగి మార్కెట్లకు పోటెత్తుతున్నట్టు వ్యాపారులు తెలిపారు. ఒక్క బీజాపూర్ మార్కెట్ నుంచే నిత్యం ఉత్తర భారతదేశానికి సుమారు 50 లారీల సరుకు ఎగుమతి అవుతోంది. దీంతో మిగిలిన మార్కెట్ల నుంచి వెళ్లే కాయలు ఎక్కడ అమ్ముకోవాలో అర్థం కాని పరిస్థితి ఉంది. దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాల వల్ల నిమ్మ వాడకం తగ్గింది. సాధారణంగా వేసవిలో వినియోగం పెరిగుతుంది. అయితే అకాల వర్షాల కారణంగా వాతావరణం చల్లబడి నిమ్మ వాడకం తగ్గిపోవడంతో మార్కెట్లో ధరలు పతనమవుతున్నట్టు వ్యాపారులు పేర్కొంటున్నారు. బయటి మార్కెట్ల నుంచి ఈ సీజన్‌లో పెరిగిన ఎగుమతుల వల్ల గూడూరు, పొదలకూరు మార్కెట్లకు ఇబ్బందిగా మారింది. ఢిల్లీ మార్కెట్‌కు సైతం బీజాపూర్ నుంచి పెద్ద సంఖ్యలో కాయల ఎగుమతి జరుగుతోంది.

ఇదే పరిస్థితి

ఈ ఏడాది ఆగస్ట్ వరకు నిమ్మ మార్కెట్‌లో ఇదే పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. జూన్, జులైలో కురిసే వర్షాల వల్ల తోటల్లో కాయలకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి. నైరుతి రుతుపవనాలు త్వరగా పలకరించే పరిస్థితి ఉందని వాతావరణ శాఖ వెల్లడిస్తున్న నేపథ్యంలో వాతావరణం చల్లబడితే నిమ్మకు డిమాండ్ గణనీయంగా తగ్గుతుంది. ఫలితంగా ఆగస్ట్ వరకు ధరలు పెరిగే అవకాశం ఉండదు. మధ్యలో స్వల్పంగా పెరిగినా మళ్లీ పతనమవుతాయని వ్యాపార వర్గాలు అంటున్నాయి. తోటల్లో ఉన్న కాయలు అయిపోవడం, బీజాపూర్ తదితర ప్రాంతాల్లో దిగుబడి తగ్గిపోతే మార్కెట్ ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో పుంజుకుంటుంది. దసరాకు తిరిగి ధరలు పెరిగి రెండు నెలల వరకు కొనసాగే అవకాశం ఉంటుంది.

ధరలు తగ్గాయి



ఒక్కసారిగా నిమ్మ ధరలు తగ్గాయి. అయితే ఈ ఏడాది ఆశించిన స్థాయిలో ధరలు ఉండటంతో సంతృప్తిగానే ఉన్నాం. ఈ నెలంతా ధరలు పతనం కాకుండా ఉండుంటే బాగుండేది. తిరిగి పెరుగుతాయనే ఆశ కూడా ఉంది.

– ఎం.శంకర్‌రెడ్డి, నిమ్మ రైతు, ముదిగేడు

దసరా వరకు ఇంతే..



దసరా పండగ వరకు నిమ్మకాయల ధరల్లో ఆశించిన స్థాయిలో మార్పులుండవు. టాప్ రూ.4 వేలంటే తక్కువేమీ కాదు. ఈ ఏడాది రైతులకు బాగా గిట్టుబాటు ధరలు లభించాయి. నిమ్మ పంటకు ఏడాదిలో మూడు నుంచి నాలుగు నెలలు ధరలు పెరిగినా తోటలను కొనసాగించవచ్చు.

– ఎం.బాలకృష్ణారెడ్డి, వ్యాపారి, పొదలకూరు యార్డు

రోడ్డు ఇలా.. రాకపోకలెలా..?



కనుపర్తి బ్రాంచ్ రోడ్డు

పొదలకూరు: మండలంలోని కనుపర్తి బ్రాంచి రోడ్డు దుస్థితిలో ఉంది. పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉందని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. తర్వాత ఎన్నికల నియమావళి, నిధుల విడుదలలో జాప్యం కారణంగా పనులు నిలిచిపోయాయి. తిరిగి పనులను సంబంధిత కాంట్రాక్టర్ పూర్తి చేయకపోవడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు.

రేషన్ దుకాణంలో తనిఖీ



కొడవలూరు: స్థానిక ఐదో నంబర్ రేషన్ దుకాణాన్ని తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. తూకాల్లో వ్యత్యాసాలున్నాయా.. లేవాననే అంశంతో పాటు రిజిస్టర్‌లో నమోదైన నిల్వలు, వాస్తవ నిల్వలను పరిశీలించారు. కార్డుదారులతో మాట్లాడి సమస్యలను ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడారు. నిల్వల్లో ఎలాంటి వ్యత్యాసాల్లేవని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నామని తెలిపారు. ఆర్‌ఐ సునీల్‌రెడ్డి, వీఆర్వో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



కల్పవృక్ష వాహన సేవ



హోమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

పొదలకూరు: పట్టణంలోని లక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం తృతీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్పవృక్ష వాహనంలో శ్రీవారు మాడవీధుల్లో ఊరేగారు. గోవింద నామస్మరణలతో దేవస్థాన ప్రాంగణం మారుమోగింది. ఉభయకర్తలుగా ఆకులూరు మధుసూదన్ – నీరజ, ఆకులూరు హేమంత్‌కుమార్ – అనురాధ దంపతులు వ్యవహరించారు. సాయంత్రం అశ్వవాహన సేవ నిర్వహించారు. ఉభయకర్తలుగా కోటేశ్వరరావు – శేషమ్మ, శ్రీనివాసులు – వెంకటసునీత, ప్రసాద్‌నాయుడు – పుష్పలత, చంద్రశేఖర్ – ఆనందమ్మ, సింహాచలం – బుజ్జమ్మలు వ్యవహరించారు. మధ్యాహ్నం, రాత్రి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను అందించారు. పాలక కమిటీ బాధ్యులు పెండ్యాల రమణయ్య, ఎం.శ్యామ్‌ప్రసాద్, బొప్పా వెంకటేశ్వర్లు, కొమ్మి వేణుగోపాల్, దాసరి శ్రీనివాసులు, మురళి తదితరులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతి వేడుకలు



ఐరావతంపై హనుమంతుడు



కోదండరామపురంలో..



ప్రత్యేక పూజలు

మనుబోలు: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మనుబోలు మండల కేంద్రంలో ఆంజనేయ స్వామి గ్రామోత్సవాన్ని గురువారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు మాధవగిరి హనుమాచార్యులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పల్లకి సేవను ఘనంగా జరిపారు. అనంతరం ఐరావత వాహనంపై హనుమంతుడిని కొలువుదీర్చి ట్రాక్టర్‌పై గ్రామోత్సవం నిర్వహించారు. అంతకుముందు ఆలయం వద్ద బాలికలు కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శించారు. కట్టువపల్లి, యాచవరం, చెర్లోపల్లి గ్రామాల్లో కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

తోటపల్లిగూడూరు: మండలంలోని పాపిరెడ్డిపాళెం గ్రామంలో గురువారం రాత్రి హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించారు. యువకులు శోభాయాత్రను ఏర్పాటు చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆల్తూరు గిరీష్‌రెడ్డి, ఆల్తూరు మహేష్‌రెడ్డిలు ఉత్సవాలకు హాజరయ్యారు. ఈశ్వరయ్య, వెంకటసుబ్బయ్య, జనార్దన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్యాక్స్ రివిజన్ సర్వేకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న బాలకృష్ణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ట్యాక్స్ రివిజన్ సర్వేకు అధిక ప్రాధాన్యమివ్వాలని నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, వార్డు అడ్మిన్ కార్యదర్శులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులను చేపట్టేందుకు కావాల్సిన నిధులను పన్నుల ద్వారా సేకరించిన మొత్తం నుంచే వెచ్చించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ క్రమంలో వార్డు అడ్మిన్ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో రోజూ పర్యటించి పన్నుల సవరణ సర్వేను పూర్తి చేయాలని సూచించారు.

గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 20 శాతం డిమాండ్‌ను అదనంగా పెంచాలని పేర్కొన్నారు.

అయ్యో.. గోవు



- 42 ఆవుల అక్రమ తరలింపు
- పట్టుకున్న ఆర్‌ఎస్‌ఎస్ నేతలు

కోవూరు: అమానవీయంగా 42 గోవులను వధించేందుకు తరలిస్తున్న ముఠా గుట్టును కోవూరులో శుక్రవారం రట్టు చేశారు. సమాచారం అందుకున్న ఆర్‌ఎస్‌ఎస్ నేతలు వీటిని అడ్డుకున్నారు. అనంతరం ఇనమడుగు సెంటర్‌లోని భారత్ గ్యాస్ గోదాము సమీపంలో ఉన్న లేఅవుట్లో దించారు. ఘటనపై నెల్లూరులోని కొరడావీధికి చెందిన శశికుమార్ ఫిర్యాదు చేశారు. వీటిని ఇటీవల కొనుగోలు చేసి వధించేందుకు తీసుకెళ్తున్నామని ముఠాలోని నలుగురు తెలిపారు.

నేటి నుంచి చెస్ శిక్షణ తరగతులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఎంజీబీ ఫెలిసిటీ మాల్లో ఆరు నుంచి 16 ఏళ్ల పిల్లలకు ఉచిత చెస్ శిక్షణ తరగతులను రోజూ సాయంత్రం ఆరు నుంచి 8.30 వరకు నిర్వహించనున్నామని చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మాల్లో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. వివరాలకు 62815 80209 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. మాల్ మేనేజర్ రాజశేఖర్, హెచ్‌ఆర్ అమూల్య, మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ జగదీష్, ఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీ శిక్షకుడు మధుసూదన్‌రెడ్డి, సీనియర్ ఆర్బిటర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు చదువు మానొద్దు

వెంకటాచలం: బాలికలు ఉన్నత చదువులు చదివే దిశగా ఆలోచన చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి సూచించారు. మండలంలోని నిడిగుంటపాళెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం – వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఉన్నత చదువుల ద్వారా చాలా గుర్తింపు వస్తుందనే విషయాన్ని తల్లిదండ్రులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీతాలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ఎస్.కామాక్షమ్మ, సీహెచ్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

- **తోటపల్లిగూడూరు:** ప్రతి ఒక్కరూ చదువు విలువ తెలుసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. మండలంలోని ముంగలదొరువు అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ బాలికలు ఉన్నత విద్యను కొనసాగిస్తే ఎన్నో ఉపాధి అవకాశాలు దక్కుతాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతి, మహిళా పోలీస్ పాల్గొన్నారు.
- **పొదలకూరు:** మహ్మదాపురం ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ మాట్లాడుతూ విద్య వల్ల ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సుధాకర్‌రెడ్డి, మహిళా పోలీస్ శ్రీలత, వీఓఏ సుమలత, అంగన్‌వాడీ టీచర్లు ప్రమీల, రత్నమ్మ, సుజాత, హెల్పర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.
- **ఇందుకూరుపేట:** మనిషి ఎదుగుదలకు విద్య కీలకమని సీడీపీఓ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మైపాడు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఓపెన్ స్కూల్ ద్వారా మరోసారి చదువుకునే అవకాశం ఉందని తెలిపారు. సూపర్‌వైజర్ మంజుల, అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, సుబ్బలక్ష్మి, సీత తదితరులు పాల్గొన్నారు.
- **కొడవలూరు:** విద్యతో బంగారు భవిష్యత్తును పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల సూచించారు. కిశోరి వికాసంలో భాగంగా విద్య ప్రాధాన్యంపై తల్లులు, కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని బసవాయపాళెంలో నిర్వహించారు. ప్రసూన, అంగన్‌వాడీ కార్యకర్త రేణుక పాల్గొన్నారు.



పొదలకూరు: పోస్టర్ల ప్రదర్శన



టీపీగూడూరు: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాధిక



ఇందుకూరుపేటలో..



కొడవలూరు: బసవాయపాళెంలో..



వెంకటాచలం: మాట్లాడుతున్న సీడీపీఓ



కొడవలూరు: గండవరంలో..

మాది రైతు సంక్షేమ సంస్థ

- ఏపీఎల్డీఏ ఛైర్మన్ విజయకుమార్



మాట్లాడుతున్న విజయకుమార్

కోవూరు: పాడి రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేసేదే పశుగణాభివృద్ధి సంస్థ అని ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ పేర్కొన్నారు. కోవూరులోని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంస్థ పాడి పరిశ్రమాభివృద్ధికి దోహదపడుతోందన్నారు. గేదెలకు మంచి దూడలు పుట్టేందుకు వీలుగా నాణ్యమైన పశు వీర్య ఉత్పత్తిని చేసి అందిస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తాయన్నారు. తమ సంస్థకు పార్టీల రంగులు పూయడం తగదన్నారు. బయట రాజకీయకంగా ఉండొచ్చేమో గానీ ఇక్కడ మాత్రం రైతుల కోసమే పని చేస్తామన్నారు. పడ్డ దూడల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. దూడలకు అందాల పోటీలు, పొట్టేళ్లకు మంచి బ్రీడ్ అందజేసి రైతుకు ఆదాయం వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. సంస్థ పర్యవేక్షణలోని చింతలదేవి ఫార్మ్‌కు దేశంలోనే గుర్తింపు ఉందన్నారు. దేశంలో రెండు డెయిరీ ఫారాలుంటే ఒకటి మధ్యప్రదేశ్‌లో ఉండగా, మరొకటి జిల్లాలోని చింతలదేవిలో 2500 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. ఈ ఫారంలో దేశంలోని అన్ని రకాల జాతుల ఆవుల ఉన్నాయన్నారు.

కృత్రిమంగా పిండం రూపొందించి దూడలను ఉత్పత్తి చేసేలా పాటు పడుతున్నామన్నారు. గతంలో దాదాపు రూ.300 కోట్ల నిధులను సమకూర్చేందుకు కృషి చేశామన్నారు. అయితే ప్రస్తుతం ఎంత మేరకు నిధులు అందుబాటులో ఉన్నాయో పరిశీలించి, తదుపరి ప్రణాళికల ద్వారా కార్యాచరణను ప్రారంభిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో పలు నామినేటెడ్ పదవులను రద్దు చేస్తూ అధికారులు ఆదేశాలిచ్చారన్నారు. తనను ఏపీఎల్డీఏ చైర్మన్ పదవి నుంచి తొలగించిందన్నారు. తన పదవి నామినేటెడ్ కాదని, ఎన్నికల ప్రక్రియ ద్వారా ఎన్నుకున్న పదవి అని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లడంతో కొనసాగించాలని ఆదేశాలిచ్చిందని తెలిపారు. పశుసంవర్ధక శాఖ డీడీ శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ అనూప్‌రెడ్డి, నాయకులు మల్లికార్జునరావు, వెంకటరమణయ్య, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.